## ప్రకృతివనం పరిశుభ్రం

**'నమస్తే' కథనానికి స్పందించిన అధికారులు**




ప్రకృతి వనం పరిసరాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మాచారెడ్డి, మే 20 : మండలంలోని కాకులగుట్టతండా గ్రామంలో ఉన్న పల్లె ప్రకృతివనాన్ని అధికారులు సోమవారం పరిశుభ్రం చేయించారు. 'నమస్తే తెలంగాణ'లో 'పల్లెప్రకృతి వనం.. కళా విహీనం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి జీవన్ పల్లెప్రకృతి వనాన్ని సోమవారం సందర్శించారు. వనంలో ఉన్న చెత్తాచెదారాన్ని కూలీలతో తొలగింపజేశారు. పల్లెప్రకృతి వనం అటవీభూముల్లో ఉండడంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేకపోయామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.

## నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి



బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

నస్రుల్లాబాద్, మే 20 : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని ఎంపీపీ రఘు అన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల మండల డీలర్లతో ప్రత్యేక సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో కమల మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. గత సీజన్‌లో వరి విత్తనాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇకముందు అలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఏఈవో శ్రావణ్ కుమార్, భైరాపూర్ ఏఈవో కావ్యశ్రీ, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 20 : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అన్నారు.

ఈ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందులో మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 6,236 కాగా, 4,275 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామన్నారు.

మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పరీక్ష జరుగుతున్నప్పుడు 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వర య్య, చీఫ్ సూపరింటెండెంట్లు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష

కామారెడ్డి, మే 20 : కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టణానికి చెందిన బుచ్చన్న గారి శంకర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రతాప్ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రజలు మద్యం తాగి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

నస్రుల్లాబాద్, మే 20 : మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీవో అనిత అన్నారు. బీర్కూర్ మండలం చించొల్లి గ్రామంలోని నర్సరీలో ఉన్న మొక్కలను ఆమె సోమవారం పరిశీలించారు. త్వరలో మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని ఆయన అన్నారు. మొక్కలు ఎండి పోకుండా ప్రతిరోజూ నీటిని పోసి సంరక్షించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అనంతరం కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## వివాహిత అదృశ్యం

కామారెడ్డి, మే 20 : దోమకొండ మండలం అంబారీపేట గ్రామానికి చెందిన సింగం రేణుక అనే వివాహిత తన భర్త సింగ పరశురాములుకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు ఆదివారం రాత్రి 8 గంటలకు తీసుకువచ్చింది. చికిత్స జరుగుతుండగానే రాత్రి 11 గంటల సమయంలో రేణుక ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భర్త పరశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## శివాయిపల్లిని సందర్శించిన కేంద్ర బృందం



శివాయిపల్లిలో కేంద్ర ప్రభుత్వ అధికారులు

రాజంపేట్, మే 20 : మండలంలోని ఆదర్శ గ్రామమైన శివాయిపల్లిని కేంద్ర ప్రభుత్వ అధికారులు సోమవారం సందర్శించారని ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ ట్రైనింగ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు ఆదిత్య సింగ్, రజినీష్‌కుమార్, అభయ్ యాదవ్, దీపక్ ఠాకూర్, ప్రశాంత్ శివాయిపల్లిని సందర్శించారని అన్నారు.

వీరు ఐదు రోజులపాటు ఫౌండేషన్ ట్రైనింగ్‌లో పాల్గొంటారని, గ్రామంలోని వివిధ శాఖల పనితీరు, గ్రామ స్థితిగతులను అధ్యయనం చేస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ స్వాగతం పలికారు.

## సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి

బాన్సువాడ రూరల్, మే 20 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన బాన్సువాడ మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖలపై చర్చించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ హరిసింగ్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ, బాన్సువాడ, బుడ్మి సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, గంగుల గంగారాం, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనం కోసం జనరల్ బోగీలు కోటి ఉత్తరాల విన్నపం




ఉత్తరాలను ప్రదర్శిస్తున్న సాధారణ బోగీల సాధన సమితి సభ్యులు

కామారెడ్డి, మే 20 : ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని ప్రధాన మంత్రికి దేశ వ్యాప్త కోటి ఉత్తరాల సేకరణలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని రాశివనంలో సాధారణ బోగీల సాధన సమితి ఆధ్వర్యంలో ఉత్తరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. గాంధేయ మార్గంలో దేశ ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, రాశివనం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ



బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో కమల

నస్రుల్లాబాద్, మే 20 : బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలను ఏవో కమల సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని బీర్కూర్ సహకార సంఘంలో 166 బస్తాలు, దామరంచ సహకార సంఘంలో 166 బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, భైరాపూర్ ఏఈవో కావ్యశ్రీ, సహకార సంఘం సీఈవో విఠల్, రైతులు ఆవారి రాజు, సాయిలు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గాంధారి, మే 20: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి నరేశ్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రికార్డులతోపాటు బిల్లు పుస్తకాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని, ఎరువులను ఈ– పాస్ విధానం లోనే విక్రయించాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగుమందులను విక్రయించరాదని సూచించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసిన తర్వాతే విత్తనాలను విత్తుకోవాలని రైతులకు సూచించారు.

## కోతులు, పందుల బెడదను తొలగించండి

ఎల్లారెడ్డి రూరల్, మే 20: పట్టణంలోని 8వ వార్డులో కోతులు, పందుల బెడదను నివారించాలని కోరుతూ వార్డుకు చెందిన మహేశ్ సోమవారం మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కోతులు, పందుల బెడదతో పాటు వార్డులో మురికికాల్వలు అధ్వానంగా మారాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# బస్టాండ్‌లో ఆటోలు.. రోడ్డుపై బస్సులు




బస్టాండ్‌లోకి వెళ్లకుండా రహదారిపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్టీసీ బస్సు



బస్టాండ్ ముందు నిలిపిన ఆటోలు

**ఆర్టీసీ అధికారులపై ప్రయాణికుల ఆగ్రహం**

నాగిరెడ్డిపేట, మే 20: మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు వెళ్లకపోవడంతో.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా ఏ ఒక్క ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. ప్రధాన రహదారిపైనే నిలుపుతుండడంతో ప్రయాణికులు బస్టాండ్‌ను విడిచి రహదారికి ఇరువైపులా బస్సుల కోసం గంటలకొద్దీ నిరీక్షిస్తున్నారు. కొన్నిసార్లు బస్సులు ఆపకుండా వెళ్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీకి మండల కేంద్రంలో రెండు ఎకరాల స్థలం ఉండగా.. అధికారులు నిర్లక్ష్యంతో ఆటోవాలాలకు ఆటో స్టాండ్‌గా మారింది. బస్టాండ్‌లో కనీస వసతులు లేవని, రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో వసతులు కల్పించాలని విన్నవించారు.

## జీలుగ విత్తనాల పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బిచ్కుంద, మే 20: మండలంలోని పుల్కల్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విండో సీఈవో సాయి ప్రకాశ్ మాట్లాడుతూ.. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం జిరాక్స్ తీసుకువచ్చి మండల విస్తీర్ణ అధికారి వద్ద నమోదు చేసుకొని తీసుక వెళ్లాలని సూచించారు. 30కిలోల బస్తా 60శాతం సబ్సిడీపై1,116 రూపాయలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాలు మాత్రమే ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ,ఏఈవో దయానంద్, పండరి, సిబ్బంది పాల్గొన్నారు.

## సంఘ లావాదేవీలు సక్రమంగా చేపట్టాలి

నాగిరెడ్డిపేట, మే 20 : గ్రామాల్లో మహిళా సంఘాల లావాదేవీలను ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా చేపట్టాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సంఘాలు నిర్ణయించిన తేదీల్లో సంఘ సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. రుణాలు పొందిన సభ్యులు సకాలంలో చెల్లించి గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వం ద్వారా చేపడుతున్న ఆక్వా కల్చర్, సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం సంఘాల్లో తలెత్తుతున్న ఇబ్బందులు, సమస్యలను గ్రామాల వారీగా అధ్యక్షులు, కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాలక వర్గం సభ్యులు, సీసీలు దత్తు, నారాయణ, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులను వసూలు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

గాంధారి, మే 20: ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గుజ్జుల్ తండా పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు నీరు పోయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

## పద్మాజీవాడీలో సెంట్రల్ సెక్రటేరియట్ బృందం



పద్మాజీవాడీలో పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన సెంట్రల్ టీం

రామారెడ్డి , మే 20: సదాశివనగర్ మండలం పద్మాజీవాడీ గ్రామ పంచాయతీని సెంట్రల్ సెక్రటేరియట్ బృందం సో సభ్యులు సోమవా రం సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, పల్లెప్రకృతి వనం, అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు, వీరు గ్రామంలో నాలుగు రోజులపాటు వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించనున్నారు. బృందం వెంట ఎంపీడీవోతోపాటు ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, జీపీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

## ట్యాంకు బండ్ పనుల పరిశీలన

ఎల్లారెడ్డి, మే 20 : ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై కొనసాగుతున్న ట్యాంకు బండ్ నిర్మాణ పనులను నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. రెండేండ్ల క్రితం పనులు నిలిచిపోగా.. పది రోజుల నుంచి ప్రారంభించారు. బండరాళ్లు పేరుస్తున్న తీరును నిశితంగా పరిశీలించి, పలు సూచనలు అందజేశారు. ట్యాంకు బండ్ నిర్మాణం కోసం రూ. 5.41 కోట్లు మంజూరుకాగా.. ఏడేండ్ల క్రితం పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మద్నూర్, మే 20: మండలకేంద్రంలో ఈ నెల 23, 24వ తేదీల్లో శ్రీలక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం నిర్వహించనుండగా, ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రథానికి రంగులు వేసి సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. రథోత్సవం అనంతరం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. రథోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో జాతర ఏర్పాటు చేశారు.

## వైభవంగా ధ్వజారోహణం

మాచారెడ్డి, మే 20 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీధర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి తెలిపారు.

## త్రిలింగేశ్వరాలయంలో అభిషేకాలు

నాగిరెడ్డిపేట, మే 20: మండలంలోని పురాతన శైవక్షేత్రమైన త్రిలింగేశ్వరాలయంలో సోమవారం వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని రామేశ్వరుడు, భీమేశ్వరుడు, సోమేశ్వరుడు మూడు లింగాలకు భక్తి శ్రద్ధలతో అభిషేకాలు చేశారు. ఆలయాలను పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు ప్రసాదాల వితరణ చేపట్టారు. రాత్రి వేళ ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో తెల్లవారు జాము వరకు భజన కార్యక్రమం కొనసాగింది.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ఎల్లారెడ్డి, మే 20 : మండలంలోని ఆజామాబాద్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో వినోద్ గౌడ్ సోమవారం పరిశీలించారు. గ్రామ శివారులో రైతుల కోసం నిర్మిస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు వెడల్పుగా ఉండాలని, రైతుల రాక పోకలకు వీలుగా వేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల హాజరుపట్టికను పరిశీలించి సోమవారం 55 మంది హాజరైనట్లు తెలిపారు.

## ఆటో చోరీ

బాన్సువాడ, మే 20 : బాన్సువాడలోని పాత బాన్సువాడలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పట్టణ సీఐ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూర్ మండలానికి చెందిన నక్క రవి వృత్తిరీత్యా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న పాత బాన్సువాడ లోని చిన్నమ్మ కొడుకు నల్ల రాజశేఖర్ ఇంట్లో ఫంక్షన్ ఉన్నందున ఆటోలో రుద్రూర్ నుంచి పాత బాన్సువాడకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఆటోను నల్ల రాజశేఖర్ ఇంటి ఎదుట రాత్రి పార్కింగ్ చేసి పడుకున్నట్లు సీఐ తెలిపారు. మరుసటి రోజు ఉదయం 6 గంటల సమయంలో ఇంటి బయటికి వచ్చి చూడగా ఆటో కనిపించలేదని తెలిపారు. తన ఆటోను గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లారని బాధితుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## చెరువులో జారిపడి ఒకరి మృతి

దోమకొండ, మే 20: మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన గుర్రపుగారి వెంకటి (50) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రపుగారి వెంకటి తన కొడుకు నరేందర్‌తో కలిసి సోమవారం ఉదయం బట్టలు ఉతకడానికి చెరువు వద్దకు వెళ్లారు. బట్టలు ఉతుకుతున్న క్రమంలో గుర్రపుగారి వెంకటి కాలుజారి చెరువులో పడిపోయాడు. గమనించిన కొడుకు వెంటనే చెరువులోకి దూకి తండ్రిని బయటికి తీశాడు. అనంతరం దోమకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.